సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 7 । ఆగస్టు । 2023



టమాట కిలో రూ.110

అనంతపురం మండలంలోని కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.110 పలికింది.



పెరుగుతున్న నీటి నిల్వ

తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ రోజు రోజుకూ పెరుగుతోంది. ఆదివారం 85.184 టీఎంసీలకు చేరింది. డ్యాంలోకి 11,200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది.

గరిష్టం/కనిష్టం
37.4°/22.6°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోత, గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

ఫోన్ పోయినా నో ఫికర్!

నేటి రోజుల్లో అందరికీ సెల్‌ఫోన్ అత్యవసర వస్తువుగా మారిపోయింది. పల్లెవాసులు మొదలు గృహిణులు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ ఆండ్రాయిడ్ ఫోన్ వాడుతున్నారు. ముఖ్యమైన సమాచారంతో పాటు చిన్న చిన్న వివరాలను కూడా అందులో నిక్షిప్తం చేసేస్తున్నారు. అంతటి విలువైన సెల్ పోయిందంటే వేసే బాధ అంతా ఇంతా కాదు. అయితే, పోయిన ఫోన్‌ను రోజుల వ్యవధిలో రికవరీ చేస్తూ సంతోషం పంచుతున్నారు పోలీసులు.

- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న పోలీసు శాఖ
- వేగంగా సెల్‌ఫోన్ల రికవరీ
- బాధితుల హర్షం



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి (ఫైల్)

పుట్టపర్తి టౌన్: గతంలో సెల్ ఫోన్ పోగొట్టుకొంటే దొరికేది కాదు. కొత్తది కొనుగోలు చేయాల్సి వచ్చేది. చాలా విలువైన సమాచారం అందులో ఉంటే అంతే సంగతులు. అయితే, కాలం మారింది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. టెక్నాలజీని అందిపుచ్చుకున్న పోలీసు శాఖ కేసులను వేగంగా పరిష్కరిస్తోంది. అందులో భాగంగానే దొంగిలించబడిన సెల్ ఫోన్లను వేగంగా రికవరీ చేసి బాధితులకు అందిస్తోంది. తిరిగి రాదనుకున్న ఫోన్ మళ్లీ చేతిలోకి రావడంతో బాధితుల సంతోషం అంతా ఇంతా కాదు.

ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్..

మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల కోసం జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్ 6305800426 తీసుకొచ్చింది. ముందుగా ఆ నంబర్‌కు హాయ్ అని మేసేజ్ పంపిస్తే ఓ లింక్ వస్తుంది. దాన్ని ఓపెన్ చేసి సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేయాలి. వాటి ద్వారా పోయిన ఫోన్‌ను జిల్లా ఐటీ కోర్ విభాగం పోలీసులు ట్రాక్ చేస్తారు. దొరగ్గానే తిరిగి అప్పగిస్తారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి గత నెల వరకు 1,852 ఫోన్ కేసులు నమోదయ్యాయి. 186 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక నోడల్ అధికారిగా అడిషనల్ ఎస్పీ విష్ణును జిల్లా ఎస్పీ నియమించడం గమనార్హం.

కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు..

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుల కోసం కేంద్ర ప్రభుత్వం కూడా టెలికాం మంత్రిత్వ శాఖ సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) అనే వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే, ఇందులో వివరాలు నమోదు చేయాలంటే ముందుగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అనంతరం సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్ ఫోన్ అనే లింక్‌పై క్లిక్ చేయాలి. సెల్ ఫోన్ ఐఎంఈఐ నంబర్, కంపెనీ పేరు, మోడల్ మొబైల్ కొనుగోలు బిల్లు తదితర వివరాలు అప్లోడ్ చేయాలి. ఫోన్ ఏ రోజు, ఎక్కడ పోగొట్టుకున్నారు, రాష్ట్రం, జిల్లాతో పాటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వివరాలు నమోదు చేయాలి. అనంతరం దొంగిలించబడిన ఫోన్‌లోని సిమ్ కార్డు నంబర్ మళ్లీ తీసుకోవాలి. అది యాక్టివేట్ అయ్యాక ఒక ఐడీ నంబర్ వస్తుంది. దీని సాయంతో ఫోన్ స్టేటస్ తెలుసుకోవచ్చు. సీఈఐఆర్ వ్యవస్థ ద్వారా పోయిన మొబైల్ ఏ కంపెనీదైనా 24 గంటల్లో పనిచేయకుండా చేయవచ్చు. సెల్‌ఫోన్ దొంగలు ఎన్ని సిమ్‌లు మార్చినా పసిగట్టవచ్చని పోలీసులు చెబుతున్నారు.



పోలీసులు రికవరీ చేసిన సెల్‌ఫోన్లు

విస్తృతంగా అవగాహన

సెల్ ఫోన్లు వినియోగించే ప్రతి ఒక్కరికీ సీఈఐఆర్ వ్యవస్థపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. సెల్‌ఫోన్ల రికవరీలో సాంకేతికత చాలా ఉపయోగపడుతోంది. బాధితులు సెల్ పోగొట్టుకున్న వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అన్ని వివరాలు తెలియజేస్తే ఫోన్ రికవరీ చేయడం మరింత సులభమవుతుంది.

– మాధవరెడ్డి, ఎస్పీ

నెలలోపే రికవరీ



పని నిమిత్తం గత నెలలో పుట్టపర్తి వచ్చా. సామ్‌సాంగ్ కంపెనీకి చెందిన రూ. 15 వేల సెల్‌ఫోన్ ఎక్కడో పోయింది. తెలిసిన స్నేహితులు కొందరు చెబితే పోలీసు శాఖ వాట్సాప్ నంబర్‌కు ఫోన్ వివరాలతో ఫిర్యాదు చేశా. సెల్ దొరికిందంటూ నెలలోపే ఫోన్ చేశారు. పుట్టపర్తి ఎస్పీ కార్యాలయానికి పిలిపించి అందజేశారు. చాలా సంతోషమేసింది.

– అరుణ్‌కుమార్, మేడాపురం గ్రామం, చెన్నేకొత్తపల్లి మండలం

రూ.18 వేల ఫోన్ తిరిగొచ్చింది



ఈ ఏడాది మార్చి నెలలో రూ. 18 వేల విలువ చేసే సెల్ పోగొట్టుకున్నా. అందులో విలువైన సమాచారం ఉండడంతో చాలా బాధేసింది. మళ్లీ దొరకదని దిగులు చెందా. పోలీసులకు వాట్సాప్ ద్వారా వివరాలు పంపా. గత నెలలో పోలీస్ కార్యాలయానికి పిలిచి ఎస్పీ చేతుల మీదుగా ఫోన్ అప్పగించారు. పోలీసు శాఖ వాట్సాప్ నంబర్ ఎంతో ఉపయోగపడింది. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– మురళి, పుట్టపర్తి

న్యూస్‌రీల్

రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేపట్టాలి



పంటను పరిశీలిస్తున్న డైరెక్టర్ బేరా

బుక్కరాయసముద్రం: రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేపట్టాలని జాతీయ వేరుశనగ పరిశోధన సంస్థ (జునాగఢ్ గుజరాత్) దక్షిణ ప్రాంత డైరెక్టర్ డాక్టర్ కె.బేరా శాస్త్రవేత్తలకు సూచించారు. ఆదివారం రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానాన్ని ఆయన సందర్శించారు. ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ సహదేవరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ కె.బేరా మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడం వలన అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. బెట్ట పరిస్థితులు తట్టుకునే విత్తనాలు లేకపోవడం వల్ల జిల్లాలో వేరుశనగ సాగు తగ్గిపోయిందన్నారు. వేరుశనగ లాభదాయకం కావాలంటే పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, యాంత్రీకరణ చేపట్టాలని సూచించారు. జిల్లా నుంచి ఔత్సాహిక రైతు బృందం జాతీయ వేరుశనగ పరిశోధన సంస్థ (జునాగడ్ గుజరాత్)ను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాధిక, శాస్త్రవేత్తలు నటరాజ్, వెంకటరమణ, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సహజ దేవా, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'స్పందన'

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. డివిజన్, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్, ఫోన్ నంబర్లు పొందుపరచాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలు ఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు.

పీఏబీఆర్, ఎంపీఆర్‌లకు నీటి మళ్లింపు



మోపిడి లింక్ చానల్ వద్ద పీఏబీఆర్‌కు వెళుతున్న తుంగభద్ర జలాలు

ఉరవకొండ: హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి ఆదివారం పీఏబీఆర్, ఎంపీఆర్‌లకు వెయ్యి క్యూసెక్కుల నీరు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. మోపిడి వద్ద హెచ్చెల్సీ లింక్ చానల్ నుంచి పీఏబీఆర్ (పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కు 300 క్యూసెక్కులు, మిడ్‌పెన్నార్ డ్యాం(ఎంపీఆర్)కు 700 క్యూసెక్కుల నీరు వెళ్తోందన్నారు. నీటిని తాగు అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని హెచ్చెల్సీ ఏఈ గోపాల్ నాయక్ తెలిపారు. సాగునీటికి ఇంకా అనుమతులు రాలేదని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి టీటీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ వేదికగా జరిగిన రీజనల్ స్థాయి నవోదయ విద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీల్లో 30 మంది విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు ఆదివారం తెలిపారు. బాలుర విభాగం అండర్-14లో తరుణ్ (వయనాడ్), అండర్-17లో గగన్‌శ్రీ (తూర్పుగోదావరి-1), అండర్-19లో కేకేఎం స్వామి (తూర్పుగోదావరి-1), బాలికల విభాగం అండర్-14లో ఎం.వాత్సల్య(తూర్పుగోదావరి-1), అండర్-17లో ఎంఎస్ శ్రేయ (చిక్కమగళూరు), అండర్-19లో హాసిని (తూర్పుగోదావరి-1) ఎంపికైనట్లు తెలిపారు. వీరు సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకూ చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్ నవోదయ విద్యాలయలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

'అడిగినంత ఇవ్వకుంటే దుకాణం సీజ్ చేస్తా'

- కమిషనర్ పేరిట ఓ అగంతకుడి బెదిరింపు

కదిరి టౌన్: పలువురు దుకాణదారులకు ఓ అగంతకుడు ఫోన్ చేసి తాను కదిరి మున్సిపల్ కమిషనర్ అంటూ బెదిరింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పట్టణంలోని కొందరు దుకాణదారులకు రెండు రోజుల నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేస్తున్నాడు. తాను మున్సిపల్ కమిషనర్ అని.. 'మీ దుకాణానికి పర్మిషన్ లేదు.. అడిగినంత డబ్బు చెల్లించకుంటే సీజ్ చేస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో భయపడిన దుకాణదారులు ఆదివారం స్థానిక మున్సిపల్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఆ వ్యక్తి నంబర్‌కు సిబ్బంది ఫోన్ చేస్తే కట్ చేసి, నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో ఉంచాడు. దీనిపై కమిషనర్ శ్రీవారిబాబు మాట్లాడుతూ 09110763848 నంబర్ నుంచి రవీంద్రరెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

తాడిమర్రి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సొసైటీ చైర్మన్ వైటీ చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు పన్నూరు కృష్ణమూర్తి, బిల్లే ముత్యాలప్పకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సొసైటీలను బలోపేతం చేస్తోందన్నారు. రైతుల కోసం తాడిమర్రిలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం సమీపంలో రూ.40 లక్షలతో వ్యవసాయ గోడౌన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పంటలను అరబెట్టుకోవడమే కాకుండా, గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవచ్చన్నారు. వేరుశనగ పంటతో పాటు చీనీ, దానిమ్మ, మామిడి తదితర పంటలకు బీమా అందించి ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని కొనియాడారు. జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వడ్డి గోపాల్ రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు పొరాళ్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి, జొల్లిరెడ్డి అశ్వర్థ, వడ్డి రామలింగారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, తాడిమర్రి రమణారెడ్డి, తాడిమర్రి శ్రీధర్‌రెడ్డి, మల్లప్పగారి మాధవరెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు, బండారు పెద్దటబిలేసు, సొసైటీ సీఈఓ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ.. నాన్న.. ఓ చిన్నారి

- పిల్లల దత్తత కోసం పలువురు క్యూ
- ఎక్కువ దరఖాస్తులు వచ్చిన జిల్లాల్లో 'అనంత'కు రెండో స్థానం



అనంతపురంలో కొన్ని నెలల క్రితం అమెరికా దంపతులు దత్తత తీసుకున్న చిన్నారి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పిల్లలు లేని దంపతులకు ఆ లోటు ఉండకూడదనే ఉద్దేశంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ దత్తత ప్రక్రియను ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక విభాగం కూడా ఉంది. ప్రతి జిల్లా కేంద్రంలో శిశు గృహాలను ఏర్పాటు చేసింది. అనాథలు, ఆదరణకు నోచుకోని పిల్లలను శిశుగృహాలో సంరక్షిస్తుంటారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు ఆ లోటును పూడ్చేందుకు, అనాథ పిల్లలకు తల్లిదండ్రులు లేని లోటును తీర్చేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసీడీఎస్ పని చేస్తోంది. 15 ఏళ్లలోపు బాలబాలికలు దత్తతకు అర్హులు. దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు వారి అర్హత ఆధారంగా పిల్లలను ఇస్తారు.

దత్తత కోసం దరఖాస్తుల వెల్లువ

రాష్ట్రంలో చిన్నారులను దత్తత చేసుకోవాలని వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా విశాఖ, ఆ తర్వాతి స్థానం ఉమ్మడి అనంతపురం జిల్లాదే. గడిచిన ఏడాది 172 మంది దంపతులు చిన్నారుల కోసం దత్తతకు వచ్చారు. వీరిలో 21 మందికి మాత్రమే దత్తత అవకాశం దక్కింది. మిగతా 151 దరఖాస్తులు వెయిటింగ్‌లో ఉన్నాయి. అనంతపురం జిల్లాకు వచ్చిన దరఖాస్తుల్లో ఇతర దేశాల వారూ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,184 దరఖాస్తులు వెయిటింగ్‌లో ఉండగా అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే 151 ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి

ఒక చిన్నారిని దత్తత చేసుకోవాలంటే వివిధ దశల్లో దరఖాస్తు ప్రక్రియ ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారం www.cara.nic.in వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తును పైన పేర్కొన్న వెబ్‌సైట్‌కు రూ.6వేలు డీడీ సమర్పించి అప్‌లోడ్ చేయాలి. అనంతరం దత్తత ఏజెన్సీ వారు అధ్యయనం చేసి నివేదికను వెబ్‌సైట్‌లో పెడతారు. దత్తతకు దరఖాస్తు చేసుకున్న వారి మొబైల్‌కు సమాచారం వస్తుంది. ఈ సమాచారం మేరకు 48 గంటల్లో బిడ్డ నచ్చితే రిజర్వు చేసుకోవచ్చు. రిజర్వు చేసుకున్న బిడ్డను నచ్చిందని ఆమోదం తెలియజేసి, రూ.40 వేలు డీడీ సమర్పించి బిడ్డను పొందాలి. బిడ్డను పొందిన వారం రోజుల్లో పాన్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం, వయసు ధ్రువీకరణ, దంపతుల ఫొటో, నివాస ధ్రువపత్రం, వివాహ ధ్రువపత్రం, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు ఏజెన్సీకి ఇవ్వాలి. బిడ్డను పొందిన వారం రోజుల్లో ఈ ధ్రువపత్రాలన్నీ స్థానిక కుటుంబ న్యాయస్థానం/జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో సమర్పిస్తే ఉత్తర్వులిస్తారు. బిడ్డను దత్తత తీసుకున్నాక దత్తత ఇచ్చిన సంస్థకు సంబంధించిన సోషల్ వర్కర్ బిడ్డ యోగక్షేమాల పరిశీలన రెండేళ్లపాటు చూస్తారు. ఈ సమయంలో 4 దఫాలు ఒక్కోసారి రూ.2వేల చొప్పున దత్తత తీసుకున్న దంపతులు డీడీ రూపంలో సొమ్ము చెల్లించాలి.

నిబంధనల ప్రకారం దత్తత

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని దత్తత సంస్థ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(కారా) నిబంధనల మేరకు దత్తతకు వచ్చే దంపతుల పూర్వాపరాలను పరిశీలించాకే దత్తత ఇస్తున్నాం. ఈ ఏడాది ముగ్గురి దత్తత ప్రక్రియ జరుగుతోంది. ప్రస్తుతం అనంతపురం శిశు గృహలో ఐదుగురు చిన్నారులు ఆశ్రయం పొందుతున్నారు.

–శ్రీదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

లాభాల అంతరంగం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అంతర పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వ ప్రోత్సాహం, అధికారుల సూచనలు వెరసి జిల్లాలో రైతులు విస్తారంగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఎక్కడ చూసినా నేడు మామిడి, చీనీ, జామ, కొబ్బరి, అల్లు నేరేడు తోటలు కనిపిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం సుమారు 5,200 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఉద్యాన తోటల్లో 5 ఏళ్ల పాటు అంతర పంట సాగుతో లాభాలు ఆర్జించవచ్చని అధికారులు చెప్పడంతో ఆ దిశగా రైతులు దృష్టి సారిస్తున్నారు. అంతర పంటలుగా వేరుశనగ, పూల తోటలు, రాగి, టమాట, వంకాయతో పాటు పశువుల మేతగా ఉపయోగపడే ఉలవ, గడ్డిని సైతం సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటలకు అందించే నీరే ఆ మొక్కలకూ సరిపోతోంది. భూమిపైన తడి ఆరకుండా ఉంటుంది. దీంతో ఏటా రైతులు ఆదాయం పొందవచ్చు. ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తే ప్రభుత్వం సహకారం అందిస్తుందని డ్వామా పీడీ రామాంజనేయులు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. గుంతలు తీయడం, మొక్కల కొనుగోలు, సంరక్షణ, నీటి తడులు, కంచె ఏర్పాటుకు చేయూత అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



కొత్తచెరువు మండలం లోచర్ల వద్ద చీనీ తోటలో వేసిన వేరుశనగ పంట



పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద అల్ల నేరేడులో అంతర పంటగా వేరుశనగ సాగు

స్కాలర్‌షిప్ మంజూరుకు బయోమెట్రిక్ తప్పనిసరి

కదిరి అర్బన్: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాల మంజూరుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్ల బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ రఫీ ఓ ప్రకటనలో తెలిపారు. బయోమెట్రిక్ అథెంటికేషన్ నమోదు చేయకపోతే విద్యార్థుల ఖాతాల్లో ఉపకార వేతనాలు జమకావని పేర్కొన్నారు. అనంతపురం పెన్నార్ భవన్‌లోని సీపీఓ మీటింగ్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల్లోపు నమోదు చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతపురం, రాప్తాడు, శింగనమల, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి నియోజకవర్గాల్లోని పాఠశాల, కళాశాలల్లో అథెంటికేషన్ చేయించుకోవాల్సిందిగా సూచించారు. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల శ్రీనివాస డిగ్రీ కళాశాలలో (ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలు), హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల వారు హిందూపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అజీజియా మునిసిపల్ ఉర్దూ హైస్కూల్‌లో, కదిరి, నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట, తలుపుల, ఎన్‌పీ కుంటకు సంబంధించిన వారు కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

హిందూపురం టౌన్: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం హిందూపురంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జేవీ అనిల్‌కుమార్(హిందూపురం), ఉపాధ్యక్షులుగా ఎం.చంద్రశేఖర్ (ధర్మవరం), కె.ఇర్షాద్ అలీ (కదిరి), కార్యదర్శిగా బీకే మహమ్మద్ సలీం (హిందూపురం), కోశాధికారిగా ఎస్.శేఖర్(హిందూపురం), సహాయ కార్యదర్శులుగా బి.కార్తీక్ (పరిగి), ఈ.శ్రీనివాసులు (కొత్తచెరువు), ఈసీ మెంబర్లుగా డి.విజయవాణి (హిందూపురం), ఎస్.నవీద్ (మడకశిర)ఎన్నికయ్యారు.

వ్యక్తి దుర్మరణం

హిందూపురం అర్బన్: వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రేకులకుంటకు చెందిన చాకలి వసంతకుమార్ (32) హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని కిరికెరలో భార్య, ఇద్దరు కుమార్తెలతో కలసి నివాసముంటున్నాడు. పీర్ల పండుగకని వెలిదడకల గ్రామంలోని తన అత్తారింటికి వెళ్లేందుకు ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. చిన్నగుడ్డంపల్లి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా గోరంట్ల నుంచి వస్తున్న ఐచర్ వాహనానికి వెనుక వైపు అదుపు తప్పి ఢీకొన్నాడు. ఘటనలో నుదుటికి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మధు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఎంపికైన చెస్ క్రీడాకారులు

హిందూపురం టౌన్: రాష్ట్ర స్థాయి అండర్-15 చెస్ చాంపియన్ షిప్ పోటీలకు బాల, బాలికలను ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక స్పార్టన్ చెస్ అకాడమీలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఎంపికలను చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌బాబు, కార్యదర్శి నాగార్జున, టోర్నీ డైరెక్టర్ ఆరీఫుల్లాఖాన్ పర్యవేక్షించారు. బాలుర విభాగంలో వరుసగా తొలి నాలుగు స్థానాలను తనిష్క్, చింతా జయకృష్ణ, కేదార్‌నాథ్ గుప్తా, యశ్వంత్, బాలికల విభాగంలో తొలి నాలుగు స్థానాలను వైష్ణవి, మోక్షిత, చందన సహస్ర, జ్ఞాపికరెడ్డి నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 24 నుంచి 27 వరకూ అనంతపురంలో జరిగే పోటీలకు బాలురు, సెప్టెంబర్ 7 నుంచి 10వ తేదీ వరకూ గుంతకల్లులో జరిగే పోటీలకు బాలికలు శ్రీసత్యసాయి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. విజేతలకు ప్రభుత్వ చిన్నపిల్లల వైద్యుడు అప్తాబ్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ శివక్రిష్ణ పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి యువత తోడు

- జిల్లాలో పర్యాటక స్థలాలపై విద్యార్థులకు అవగాహన
- పాఠశాలలు, కళాశాలల్లో యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటు
- చొరవ తీసుకొంటున్న పర్యాటక శాఖ



లేపాక్షిలోని ఏడు పడగల నాగేంద్రుడి విగ్రహం



బట్రేపల్లి జలపాతం



కటారుపల్లి వేమన సమాధి

పుట్టపర్తి టౌన్: జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఆ శాఖ ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. విద్యార్థులు, యువత భాగస్వామ్యంతో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి, ఆ దిశగా చర్యలు వేగవంతం చేసింది.

చరిత్ర తెలియని నేటి యువత

ర్యాంకుల పోటీ ప్రపంచంలో ప్రస్తుత విద్యార్థుల్లో చాలా మందికి భౌగోళిక పరిస్థితులు, చరిత్ర గురించి తెలియదు. ఫలితంగా జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి పర్యాటక శాఖ యువత సాయం తీసుకుంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో జిల్లాలోని వివిధ పాఠశాల్లో యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా మరింత ప్రచారం చేపట్టాలని జిల్లా పర్యాటక శాఖ నిర్ణయించింది. ఈ దిశగా ఇప్పటికే జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో యువ క్లబ్‌ల ఏర్పాటు ప్రక్రియ జోరుగా సాగుతోంది.

ప్రాచుర్యం కోల్పోయిన పర్యాటక ప్రదేశాలు

జిల్లాలో అన్ని రకాల సందర్శనీయ స్థలాలు దాదాపు 20కు పైగా ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి విశేషాలున్న ఈ పర్యాటక ప్రదేశాలను సంపూర్ణంగా చూసి రావాలంటే కనీసం ఆరు రోజుల సమయం కావాలి. అయితే సరైన ప్రచారం లేకపోవడంతో ఈ ప్రదేశాలు పర్యాటకుల దృష్టిని ఆకర్షించడం లేదు.

20 ప్రదేశాలు... 30 క్లబ్‌లు

జిల్లాలోని పర్యాటక ప్రదేశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా పర్యాటక శాఖ విస్తృత చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఇప్పటికే విద్యార్థుల సమూహంతో యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా 30 క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. యువ క్లబ్ సభ్యులను తొలుత జిల్లాలోని పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్లి, వాటి ప్రాముఖ్యత, చరిత్రపై అవగాహన కల్పించనున్నారు. అనంతరం తాము తెలుసుకున్న అంశాలను పది మందికి తెలిపేలా యువ పర్యాటక సభ్యులు కృషి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏర్పాటైన 30 క్లబ్‌ల నుంచి ఆశించిన మేర ఫలితాలు వస్తే భవిష్యత్‌లో మరిన్ని క్లబ్‌ల ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ భావిస్తోంది.

మరిన్ని క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు

ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించేలా యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పర్యాటక ప్రదేశాల విశిష్ఠత, ప్రాధాన్యత, భౌగోళిక పరిస్థితులపై క్లబ్ సభ్యులు తెలుసుకున్న అంశాలను వైరల్ చేయడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. దీంతో జిల్లాలో పర్యాటకరంగానికి పూర్వ వైభవం చేకూరుతుంది. జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాలను సందర్శించి రానున్న రోజుల్లో మరిన్ని క్లబ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరెడ్డి, జిల్లా టూరిజం అధికారి

యువ క్లబ్‌లకు విధివిధానాలు

- సందర్శనీయ స్థలాలకు వెళ్లినప్పుడు ఆ ప్రాంత భౌగోళిక, చరిత్ర అంశాలను పూర్తి స్థాయిలో తెలుసుకోవాలి.
- ముఖ్యమైన ప్రదేశాల్లో సంతలతో పాటు, ఆయా గ్రామ ప్రజల జీవన విధానాలపై అవగాహన పెంచుకోవాలి.
- తాము తెలుసుకున్న అంశాలను సహ విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులకు వివరించాలి. సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ చేయవచ్చు.
- ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, కార్యాచరణకు రూపకల్పన చేయాలి.
- భారత దేశయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయలపై క్లబ్ సభ్యులకు ఎంత మేరకు అవగాహన ఉందో తెలుసుకునేందుకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. వెనుకబడిన వారిని గుర్తించి, వారి పురోగతికి చర్యలు తీసుకుంటారు.

శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రముఖ పర్యాటక/ఆధ్యాత్మిక ప్రదేశాలు

- పుట్టపర్తి
- ఖాద్రీ నృసింహాలయం
- లేపాక్షి
- తిమ్మమ్మమర్రిమాను
- పెనుకొండ కోట, దర్గా
- హేమావతి
- యోగివేమన సమాధి (కటారుపల్లి)
- మడకశిర కోట
- బట్రేపల్లి జలపాతం



పెనుకొండ కోట ముఖద్వారం

చంద్రబాబే ఏ-1 ముద్దాయి

- జీవితమంతా కుట్రలు, కుయుక్తులే
- కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి: చిత్తూరు జిల్లా పుంగనూరులో విద్వేషాలు రెచ్చగొట్టి అలజడులకు కారుకుడైన ప్రతిపక్ష నేత చంద్రబాబును ఏ-1గా పరిగణిస్తూ క్రిమినల్ కేసు నమోదు చేయాలని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కదిరిలోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుయుక్తులేనన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినట్లు చెప్పుకునే చంద్రబాబు ఒక్క సాగునీటి ప్రాజెక్ట్‌ను కూడా నిర్మించలేదన్నారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో రాష్ట్రంలో పర్యటిస్తూ అలజడులు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. టీడీపీ గూండాల దాడిలో పోలీసులు సహా 50 మందికి పైగా తీవ్రంగా గాయపడితే ఎల్లో మీడియాకు కన్పించకపోవడం శోచనీయమన్నారు. పుంగనూరులో వాహనాలను తగలబెట్టిన ఘటనలో కదిరికి చెందిన 30 మంది టీడీపీ కార్యకర్తలున్నారని, వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ డీడీల కుంభకోణంలో కందికుంట వెంకటప్రసాద్ శిక్ష పడిన ఖైదీ అని, అలాంటి వ్యక్తిని పక్కనబెట్టుకుని చంద్రబాబు నీతులు వల్లించడం సిగ్గుచేటన్నారు. కదిరిలో చంద్రబాబు ఎదుటే వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలను టీడీపీ కార్యకర్తలు చింపిన వీడియో దృశ్యాలను ఎమ్మెల్యే మీడియా ఎదుట ప్రదర్శించారు. అయితే కదిరిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' విజయోత్సవ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు 30వేల మందికి పైగా పాల్గొన్నారని, కానీ ఎక్కడా ఫ్లెక్సీలను చించడం, విధ్వంసాలకు పాల్పడడం లాంటి చవకబారు పనులు చేయలేదని గుర్తు చేశారు. సమావేశంలో కదిరి ఎంపీపీ అమరనాథరెడ్డి, మాజీ కౌన్సిలర్ బండారు మురళి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన నాయకులు మణికంఠ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి యువకుడి మృతి

ముదిగుబ్బ: మండలంలోని దొరిగిల్లు సమీపంలో ఏటి నీటి గుంతలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం పట్నం గ్రామానికి చెందిన గణేష్ (23) వృత్తిరీత్యా బెంగళూరులో నివాసముంటున్నాడు. ఆదివారం దొరిగిల్లులో జరిగే మొహర్రం వేడుకలకు బంధువుల ఇంటికి వచ్చిన గణేష్ స్నానం చేసి వస్తానంటూ సమీపంలోని ఏటికి వెళ్లాడు. గుంతలోకి దిగి స్నానం చేస్తున్నప్పుడు ఫిట్స్ వచ్చి, నీట మునిగి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే న్యాయవాద వృత్తిలో రాణింపు

- జిల్లా జడ్జి జి.శ్రీనివాస్





మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్, హాజరైన న్యాయవాదులు

అనంతపురం: న్యాయవాదులు నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే వృత్తిలో రాణింపు ఉంటుందని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి జి.శ్రీనివాస్ అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) జిల్లా ద్వితీయ మహాసభ ఆదివారం అనంతపురంలోని విజయనగర 'లా' కళాశాలలో నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు సీతారామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి శ్రీనివాస్, గౌరవ అతిథులుగా ఆల్ ఇండియా బార్‌కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డి, ఏఐఎల్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు హాజరయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'ది స్పెసిఫిక్ రిలీఫ్ యాక్ట్ రూల్స్ రెగ్యులేషన్స్'పై అవగాహన కల్పించారు. న్యాయవాద వృత్తిలో ఉన్న వారు ఎప్పటికప్పుడు వెలువడుతున్న తీర్పులను పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయనగర లా కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్రాచారి, సీనియర్ న్యాయవాదులు హరినాథరెడ్డి, విజయ్‌కుమార్, బార్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ వెంకట రాముడు, రంగ నాయకులు, సీపీ గౌడ సుదర్శన్, థరమ్‌సింగ్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్క దాడిలో చిన్నారికి గాయాలు



చికిత్స పొందుతున్న బీవులా

హిందూపురం: పెంపుడు కుక్క దాడిలో ఓ చిన్నారి గాయపడింది. వివరాలు.. హిందూపురంలోని మేళాపురం 33వ వార్డులో నివాసముంటున్న అనిత, డేవిడ్ దంపతుల ఐదేళ్ల వయసున్న కుమార్తె బీవులా ఆదివారం దుకాణంలో తినుబండారం కొనుగోలుకు వెళుతుండగా అక్కడికి సమీపంలోని ఓ ఇంటి యజమాని పెంచుకుంటున్న అల్సాషియన్ కుక్క దాడి చేసి, ముఖం, కాలుపై కొరికింది. అక్కడున్న వారు వెంటనే స్పందించి కుక్కను అదిలించి బాలికను కాపాడారు. బాలికను ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, ఇప్పటికే పలుమార్లు ఆ దారిన వెళుతున్న వారిపై కుక్క దాడి చేసి, గాయపరిచిందని, కుక్కను బయటకు వదలరాదని యజమానికి తెలిపినా ఆయన పట్టించుకోవడం లేదంటూ బాలిక కుటుంబసభ్యులు గొడవకు దిగారు. కుక్క యజమానిపై చేయి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సర్ది చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కుక్క యజమానిపై కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కౌన్సిలర్లు ఆసీఫ్, రామచంద్ర, చంద్రశేఖర్, శివ, శ్రీరాంరెడ్డి తదితరులు ఆస్పత్రికి చేరుకుని బాధిత బాలికను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

అనంత సిగలో.. అందాల జలపాతాలు



కోన రామలింగేశ్వర ఆలయం ఎదుట ఉన్న జలపాతం



పచ్చని కొండల నడుమ కనిపిస్తున్న కోన చెరువు

- కోన రామలింగేశ్వరుడి చెంత ప్రకృతి పరవశం
- భారీగా తరలివస్తున్న పర్యాటకులు

వర్షాకాలంలో అనంతపురం జిల్లా ఆనందతీరంగా మారిపోతుంది. జలపాతపు సవ్వడులతో కళకళలాడుతుంది. ఎత్తైన కొండల నుంచి దూకే నీటి సవ్వడులు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. 2019 తర్వాత నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా యాడికి మండలం కోనరామలింగేశ్వరుడి క్షేత్రంలోని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి.

యాడికి: పర్యాటకుల స్వర్గధామంగా కోన క్షేత్రం విరాజిల్లుతోంది. ప్రకృతి అందాలకు నిలయమై వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది యాడికి మండలంలోని కోనుప్పలపాడు సమీపంలోని కోన క్షేత్రం. ఈ క్షేత్ర పాలకుడిగా రామలింగేశ్వరుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. స్వయంగా శ్రీరాముడే ఇక్కడ లింగాన్ని ప్రతిష్ఠించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. మహా శివరాత్రికి ఇక్కడకు భక్తులు పోటెత్తారు. మూడు రోజుల పాటు తిరునాల జరుగుతుంది.

రెండు జలపాతాల్లో ఎడతెగని నీటి సవ్వడులు..

యాడికి నుంచి 13 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో కొండల మధ్యన వెలసిన కోన రామలింగేశ్వరుడి ఆలయం ప్రకృతి అందాలకు నెలవుగా మారింది. ఆలయం ఎదుట ఉన్న జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దాదాపు 200 అడుగుల ఎత్తున ఉన్న కొండపై నుంచి పాలధారలా నీరు కిందకు జాలువారుతుంటే చూసేందుకు రెండు కన్నులు కూడా చాలవని పర్యాటకులు అంటుంటారు. అలాగే ఆలయం వెనుక అర కిలోమీటర్ దూరంలో వంద అడుగుల ఎత్తు నుంచి దూకే మరో జలపాతం ఉంది. మారడమ్మ గుడి వద్ద జలజలపారే పాల నురుగులాంటి జలపాతం దర్శనమిస్తోంది. కోనరామలింగేశ్వర ఆలయం వెనుక దాదాపు వంద మీటర్ల దూరంలో ఎకరా విస్తీర్ణంలో విస్తరించిన వందల ఏళ్ల నాటి మర్రి చెట్టు ఉంది. ఈ మహావృక్షానికి దక్షిణాన 20 ఎకరాల విస్తీర్ణంలోని చెరువు సదా నిండుకుండను తలపిస్తుంటుంది. కార్తీక మాసంలో ఈ మహా వృక్షం వద్ద వనభోజనానికి వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు.



నీటి గుండంలో సందడి చేస్తున్న పర్యాటకులు



మారడమ్మ జలపాతం

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఇక్కడ స్వచ్ఛమైన గాలిని పీల్చడం ద్వారా ఎన్నో రుగ్మతలు దూరమవుతాయి. దీంతో చాలా మంది పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. కోన క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో బాగుంటుంది.

– కోనా వెంకటశివారెడ్డి, కోనుప్పలపాడు గ్రామం, యాడికి మండలం